క్లుప్తంగా

నేడు మండల సమావేశం

కొయ్యూరు: మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని ఎంపీపీ బడుగు రమేష్ అధ్యక్షతన సోమవారం నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో లాలం సీతయ్య చెప్పారు. సంబంధిత అధికారులు విధిగా అన్ని వివరాలతో హాజరు కావాలని సూచించారు. ప్రజాప్రతినిధులు కూడా సమావేశానికి రావాలని కోరారు.

బాధితులకు అండగా ప్రభుత్వం



సీఎం సహాయనిధి చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్సీ అనంతబాబు తదితరులు

అడ్డతీగల: అనారోగ్యంతో ఉన్న పేదలందరికీ కొండంత అండగా సీఎం సహాయనిధి నుంచి సహాయం అందుతుందని ఎమ్మెల్సీ అనంత బాబు అన్నారు. అడ్డతీగల మండలం బొంగరాలపాడుకి చెందిన సియాదల భవానీ అనే ఆమె ఇటీవల అనారోగ్యం పాలై ఆస్పత్రిలో చికిత్స పొందారు. ఆమెకు మొత్తం రూ.45 వేలు చెక్కుని ఆదివారం ఆమె బంధువులకు అనంత బాబు ఎల్లవరంలో అందజేశారు. మండల జేసీఎస్ కన్వీనర్ నక్కా మోహన్, ఎల్లవరం సర్పంచ్ బెన్నోజీ నూకరత్నం పాల్గొన్నారు.

అందరి మద్దతుతోనే గెలుపు తథ్యం



అరకు అసెంబ్లీ సమన్వయకర్త మత్స్యలింగంను కలిసిన పూర్వ విద్యార్థులు

అరకులోయ రూరల్: అందరి మద్దతుతోనే అరకు నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ గెలుపు తథ్యమని అరకు అసెంబ్లీ సమన్వయకర్త రేగం మత్స్యలింగం చెప్పారు. తన వద్ద చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపుకోసం సమష్టిగా పనిచేస్తామని, గ్రామస్థాయిలో మరింత విస్తృతంగా ప్రచారం చేస్తామని పూర్వ విద్యార్థులు ఆనంద్, జగన్నాథం తదితరులు తెలిపారు. మద్దతుగా నిలుస్తున్న పూర్వ విద్యార్థులందరికీ మత్స్యలింగం కృతజ్ఞతలు తెలిపారు. ఎంపీటీసీ సభ్యులు రాంచందర్, శత్రుగున్, నాయకులు రామ్మూర్తి, పరుశురాం పాల్గొన్నారు.

ప్రేరణ ఇంటర్వ్యూల్లో 80 మంది ఎంపిక



రాజవొమ్మంగి నుంచి శిక్షణకు వెళ్తున్న అభ్యర్థులు

రాజవొమ్మంగి: మండలంలోని రాజవొమ్మంగి, జడ్డంగి స్టేషన్ల ద్వారా జరిగిన ప్రేరణ ఇంటర్వ్యూల్లో 80 మంది ఎంపికైనట్టు సీఐ సన్యాసినాయుడు తెలిపారు. కమ్యూనిటి పోలీసింగ్ కార్యక్రమాల్లో భాగంగా ఇటీవల పోలీస్‌శాఖ ఈ ఇంటర్వ్యూలు నిర్వహించిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా ఇంటర్వ్యూల్లో ఎంపికైన అభ్యర్థులకు టాటా ఎలక్ట్రానిక్స్ సంస్థల్లో ఉద్యోగం కోసం శిక్షణకు హాజరుకావాల్సి ఉంటుంది. శిక్షణ పూర్తయిన తరువాత ఉద్యోగావకాశం కల్పిస్తారు. కాగా రాజవొమ్మంగి మండలం నుంచి ఈ విధంగా ఎంపికైన వారిలో 13 మంది ఆదివారం శిక్షణ తరగతులకు తరలివెళ్లినట్టు సీఐ సన్యాసినాయుడు తెలిపారు. మిగిలిన వారు కూడా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అభ్యర్థులను కోరారు.

నేటి నుంచి ప్రతిభా పాటవ పోటీలు

మాకవరపాలెం: ఉగాది వేడుకల్లో భాగంగా ఈ నెల 19 నుంచి మార్చి 2వ తేదీ వరకు విద్యార్థులకు ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించనున్నట్టు గౌతమి లలిత కళా శిక్షణా కేంద్రం అధ్యక్ష, కార్యదర్శులు రంగరాజు, శేషగిరిరావు ఆదివారం తెలిపారు. ఈ నెల 19న వ్యాసరచన, 20న స్పెల్ బి, 21న చదరంగం, 28న చిత్రలేఖనం, 29న క్విజ్, మార్చి 1న నృత్యం, 2న పాటలు, తెలుగు, ఇంగ్లిష్ రైమ్స్ పోటీలు నిర్వహిస్తామన్నారు. స్థానిక ఉన్నత పాఠశాలలో జరిగే మండల స్థాయి పోటీల్లో మూడో తరగతి నుంచి ఇంటర్ వరకు విద్యార్థులు పాల్గొనవచ్చన్నారు.



చెంతకే ఆధునిక వైద్యం



గంగవరంలో కొత్తగా నిర్మించిన పీహెచ్‌సీ భవనం

- రూ.1.50కోట్లతో పీహెచ్‌సీకి ఆధునిక భవనం నిర్మాణం
- గంగవరం మండలంలో 24 గంటల వైద్య సేవలు
- పెరిగిన ఓపీ. ఆస్పత్రిలో ప్రసవాల కేసులు
- అన్ని వేళలా ప్రజలకు అందుబాటులో వైద్యం

గంగవరం: ప్రభుత్వం ప్రజావైద్యానికి పెద్దపీట వేసింది. కోట్లాది రూపాయలతో ఆస్పత్రుల నిర్మాణం, అధునాతన సౌకర్యాలతో ఆధునిక వైద్యాన్ని ఉచితంగా ప్రజలకు అందజేస్తోంది. ఇంటి వద్దకే వైద్య సేవలను అందుబాటులోకి ప్రభుత్వం తీసుకొచ్చింది. నాడు టీడీపీ ప్రభుత్వ హయాంలో గిరిజనులకు సర్కారు వైద్యం అందని ద్రాక్షగా ఉండేది. ప్రభుత్వ ఆస్పత్రుల్లో కనీస సదుపాయాలు లేక అరకొర సిబ్బందితో వైద్య సేవలు అందక గిరిజనులు నానా అవస్థలు పడేవారు. టీడీపీ పాలకులు ప్రజారోగ్యంపై కనీసం పట్టించుకోకపోవడంతో ప్రభుత్వ ఆస్పత్రుల సేవలు దయనీయంగా ఉండేవి. గిరిజనులు గత్యంతరం లేక అప్పులు చేసుకొని ప్రైవేట్ ఆస్పత్రుల్లో వైద్యం పొందాల్సిన పరిస్థితి ఉండేది. ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యం అందక.. అప్పులు చేయలేక ప్రాణాలు విడిచిన నిరుపేద గిరిజన రోగులు కోకొల్లలు.. అదంగా గతం... నేడు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో పేదల చెంతకే కార్పొరేట్ వైద్యం ఉచితంగా అందుతోంది. చంద్రబాబు పాలనలో వైద్యం అందక పేదలు ఎదుర్కొన్న అవస్థలను చూసిన జగన్‌మోహన్‌రెడ్డి అందరికీ కార్పొరేట్ వైద్యం ఉచితంగా అందించాలని సంకల్పించారు. ముఖ్యమంత్రిగా అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజా వైద్యం కోసం అనేక పథకాలను అమల్లోకి తీసుకొచ్చారు. కోట్లాది రూపాయలను మంజూరు చేస్తున్నారు. గ్రామ స్థాయి నుంచి గిరిజన ప్రజలకు విశేషమైన వైద్య సేవలు అందుతున్నాయి. గతంలో వైద్యం కోసం, వైద్య సేవల కోసం అనేక ఇబ్బందులు పడే గిరిజనులకు నేడు గ్రామ స్థాయిలోనే మెరుగైన వైద్యసేవలు అందుతుండడంతో ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు.

పీహెచ్‌సీలో మెరుగైన సేవలు

రంపచోడవరం నియోజకవర్గంలో గిరిజనులకు మెరుగైన వైద్య సేవలు మరింత అందుబాటులోకి తీసుకువచ్చేందుకు ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంత ఉదయభాస్కర్(బాబు) ప్రత్యేక చొరవ తీసుకున్నారు. గ్రామాల్లో పీహెచ్‌సీలకు ఆధునిక భవనాలు సమకూరాయి. మండల కేంద్రమైన గంగవరంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి రూ.1.50కోట్లతో ఆధునిక భవనం నిర్మాణం జరిగింది. ఇక్కడ పీహెచ్‌సీలో 24 గంటలు గిరిజన ప్రజలకు వైద్య సేవలు అందుతున్నాయి. ఈ భవనం రోగులకు, వైద్య సిబ్బందికి ఎంతో సౌకర్యంగా ఉంది. మహిళలకు, పురుషులకు రెండు వార్డులలో ఎనిమిది బెడ్స్ ఏర్పాటు అందుబాటులో ఉన్నాయి. కాగా మొత్తంలో 15గదులు నిర్మాణం జరిగింది. వైద్యులకు రెండు గదులు, కంటి విభాగం, మందులు, రక్త పరీక్షలు, స్టోర్ రూమ్, ఆపరేషన్ థియేటర్, ప్రసవాల గది, వ్యాక్సినేషన్, కార్యాలయ గది, బర్త్ వెయిటింగ్ రూమ్ వంటి సౌకర్యాలను ఏర్పాటు చేశారు. గంగవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గతం కంటే వైద్య సేవలు మెరుగుపడ్డాయి. గంగవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో 28 గిరిజన గ్రామాల ప్రజలకు విశేషమైన వైద్య సేవలందిస్తున్నారు. గంగవరంలో పీహెచ్‌సీలో రోజు వారీ ఓపీ (రోగుల) పెరిగింది. రోజు 80 నుండి 100 మంది వరకు ఆస్పత్రికి వస్తున్నారు. 172రకాల మందులు 15 రకాల పరీక్షలను నిర్వహిస్తున్నారు. ఈసీజీ, ఆల్ట్రా స్కానింగ్ యంత్రాలు అందుబాటులో ఉన్నాయి. అలాగే రక్త పరీక్షలకు సంబంధించి ఆధునిక యంత్ర పరికరాలతో 15 రకాల రక్తపరీక్షలు చేస్తున్నారు. ప్రతీ నెల గర్భిణులకు ప్రత్యేక వైద్య శిబిరాన్ని నిర్వహించి వారికి ఆరోగ్య జాగ్రత్తలు, ఉచితంగా మందులు అందజేస్తున్నారు. పీహెచ్‌సీలో ప్రసవాలు కూడా బాగా పెరిగినట్టు అధికారులు చెబుతున్నారు. గంగవరంలో పీహెచ్‌సీ మరింత అభివృద్ధికి కృషి చేస్తున్నామని ఎంపీపీ పల్లాల కృష్ణారెడ్డి, జెడ్పీటీసీ బేబీరత్నం అన్నారు. పిహెచ్‌సీ ప్రహరీ నిర్మాణానికి కృషి చేస్తామన్నారు.



పీహెచ్‌సీలో ఆల్ట్రా స్కానింగ్ మిషన్



మందుల విభాగం



కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు



గంగవరం పీహెచ్‌సీ భవనాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే ధనలక్ష్మి (ఫైల్)



గంగవరం పీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న గర్భిణులు



గంగవరం పీహెచ్‌సీ ఓపీలో పేర్లు నమోదు చేసుకుంటున్న రోగులు

పీహెచ్‌సీలో సిబ్బంది వివరాలు

వైద్యులు-2 . కంటి వైద్యులు-1, సూపర్‌వైజర్లు-2, స్టాఫ్ నర్సులు-3, సీహెచ్‌ఓ-1, ఏఎన్ఎంలు-8, ఎంఎల్‌హెచ్‌పీలు-4, వైద్య సహాయకులు-3, సబ్‌యూనిట్ ఆఫీసర్ -1, ఆశ వర్కర్లు-47, స్వీపర్స్ -2, వాచ్‌మెన్-1 , ల్యాబ్ టెక్నీషియన్స్- 2, 108-1, 104-1, ఫీడర్ అంబులెన్స్-1 , ఫార్మాసిస్టు -1 సిబ్బంది సేవలు అందిస్తున్నారు.

అన్ని వేళల్లో సేవలు



పీహెచ్‌సీలో రోజువారీ ఓపీ బాగా పెరిగింది. పీహెచ్‌సీకి వైద్య పరీక్షలకు వచ్చే రోగులు, గర్భిణులకు భోజన సమయానికి భోజన సౌకర్యాన్ని కల్పిస్తున్నాం. ఈ ఏడాది ఇప్పటివరకు 30 మందికి ఆస్పత్రిలోనే ప్రసవాలు చేశాం. మందులు కొరత, సిబ్బంది కొరత లేదు. గ్రామ స్థాయిలోనూ మెరుగైన సేవలు అందిస్తున్నాం. పీహెచ్‌సీల్లో 24 గంటలు సిబ్బంది అందుబాటులో ఉంటూ వైద్య సేవలందిస్తున్నాం.

– భావన, వైద్యాధికారి, గంగవరం పీహెచ్‌సీ

జగనన్నకు రుణపడి ఉంటాం



పైసా ఖర్చు లేకుండా గ్రామాల్లోని పీహెచ్‌సీల ద్వారా ఉచితంగా సంపూర్ణ వైద్య సేవలందుతున్నాయి. గతంలో ముఖ్యమైన రక్త పరీక్షలు చేయించుకోవాలంటే అడ్డతీగల, గోకవరం, లేదా రంపచోడవరం వెళ్లేవాళ్లం. ఇప్పుడు ఇక్కడే గంగవరం ఆరోగ్య కేంద్రంలోనే అన్ని రకాల రక్త పరీక్షలు ఉచితంగా చేస్తున్నారు. ఎంతో ఉపయోగకరంగా ఉంది. మా లాంటి వాళ్లకు ఉచిత వైద్యం అందిస్తున్న సీఎం జగనన్నకు రుణపడి ఉంటాం.

– యాట్ల రాఘవరెడ్డి, అడ్డపల్లి గ్రామం

గ్రామ వలంటీర్లకు పురస్కారాలు



జమితి రాజుబాబు (సేవా వజ్ర అమీనాబాద్)



జుర్రా బంగార్రాజు (సేవా వజ్ర గ్రహీత)



ఈకా రామలక్ష్మి (సేవా రత్న)



మాడెం అనిల్‌కుమార్ (సేవ రత్న)

రాజవొమ్మంగి: మండలంలోని పలు సచివాలయాల్లో పనిచేస్తున్న ఏడుగురు వలంటీర్లకు ఉత్తమ సేవలకు గాను ప్రభుత్వం అవార్డులు ప్రకటించినట్లు ఎంపీడీవో యాదగిరీశ్వరరావు తెలిపారు. వీరిలో ఇద్దరు సేవ వజ్ర, ఐదుగురు సేవా రత్నం పురస్కారాలకు ఎంపికయ్యారు. సేవా వజ్ర సాధించిన వారిలో జమితి రాజుబాబు (అమీనాబాద్), జుర్రా బంగార్రాజు (చికిలింత), సేవరత్న అవార్డు సాధించిన వారిలో లోసుల రాజశేఖర్ (వాతంటి), కోటం క్రాంతికుమార్ దొర (చెరకుంపాలెం), మాడెం అనిల్‌కుమార్ (అమీనాబాద్), ఈక రామలక్ష్మి (రాజవొమ్మంగి-2), నైని శ్రీనుబాబు (తంటికొండ) తదితరులున్నారు. వీరిని ఆయా పంచాయతీ సెక్రటరీలు అభినందించారు.

విద్యార్థులకు టాలెంట్ టెస్ట్



అనంతగిరిలో పరీక్ష రాస్తున్న విద్యార్థులు, పర్యవేక్షిస్తున్న జెడ్పీటీసీ గంగరాజు, హెచ్‌ఎం విమలకుమారి



మోడల్ టెస్ట్ రాస్తున్న పదో తరగతి విద్యార్థులు..

అనంతగిరి: విద్యార్థిని, విద్యార్థులు ప్రభుత్వం అందించే అవకాశాలను సద్వినియోగం చేసుకుని, భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని, జెడ్పీటీసీ సభ్యుడు గంగరాజు అన్నారు. మండల కేంద్రంలోని భారత విద్యార్థి ఫెడరేషన్ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు ఆదివారం టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. అనంతగిరి బాలికల-1, 2, కొత్తవలస బాలురు పాఠశాలల నుంచి 226 మంది పరీక్షల హాజరైయ్యారు. టాలెంట్ టెస్ట్‌లో జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరిచే విద్యార్థులకు మొదటి, రెండు, మూడు స్థానాల్లో రూ.5వేలు, రూ.3వేలు, రూ.2వేలు అందిస్తున్నట్టు జెడ్పీటీసీ సభ్యుడు గంగరాజు తెలిపారు. హెచ్‌ఎం విమలకుమారి, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి జీవన్, శ్రీనివాస్, భీమరాజు తదితరులు పాల్గొన్నారు.

ముంచంగిపుట్టు: పదో తరగతి విద్యార్థులకు ఆదివారం మండల కేంద్రంలో ఎస్ఎఫ్ఐ, గిరిజన సంఘం ఆధ్వర్యంలో మోడల్ టాలెంట్ టెస్ట్‌ను నిర్వహించారు. 117 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. పబ్లిక్ పరీక్షల్లో పాటించాల్సిన నియమాలు, నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కార్తీక్ మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులు పరీక్షల సమయంలో ఒత్తిడికి లోను కాకూడదన్నారు.నిత్యం చదువుపై ఏకాగ్రత ఉంచుతూ సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ చదవాలన్నారు. ఎస్ఎఫ్ఐ, గిరిజన సంఘం నేతలు పురుషోత్తం, అప్పారావు, వెంకట్, శ్రీనాథ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్టడీమెటీరియల్ పంపిణీ



విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను అందజేస్తున్న జూనియర్ కళాశాల వార్డెన్ రాము

డుంబ్రిగుడ: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన వార్డెన్ రాము తన సొంత నిధులతో కళాశాలలో చదువుతున్న నిరుపేద గిరిజన విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను ఉచితంగా ఆదివారం అందజేశారు.

కళాశాలలో చదువుకుంటున్న 250 మంది విద్యార్థిని, విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల ఉన్నత చదువు కోసం తన వంతు కృషి చేస్తున్నామన్నారు. విద్యార్థుల భవిష్యతే తమకు ముఖ్యమన్నారు. పేద గిరిజను యువత ఉద్యోగాల కోసం పోటీ పరీక్షలు పాల్గొనే వారికి సలహాలు ఇస్తూ ఆర్థికంగా కూడా ప్రోత్సాహాన్ని అందిస్తున్నట్టు చెప్పారు. విద్యార్థులు స్టడీ మెటీరియల్‌ను సక్రమంగా సద్వినియోగం చేసుకోవాలన్నారు. వార్డెన్ రాము అందిస్తున్న సేవలకు విద్యార్థుల తల్లిదండ్రులు ఎంతో అభినందించారు.

రేపటి నుంచి దేవి తీర్థ మహోత్సవాలు

దేవరాపల్లి: స్థానిక ఉమామహేశ్వరి దేవి తీర్థ, కల్యాణ మహోత్సవాల గోడపత్రికలను వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కిలపర్తి భాస్కరరావు ఆధ్వర్యంలో డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు ఆదివారం ఆవిష్కరించారు. ఈ నెల 20 నుంచి 25వ తేదీ వరకు కల్యాణ తీర్థ మహోత్సవాలను నిర్వహిస్తామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఆఖరి రోజు 25న అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఈ మేరకు డిప్యూటీ సీఎంకు ఆహ్వాన పత్రికను అందజేశారు. తొలి రోజు 20న గణపతి పూజ, పుణ్యాహవచనం, అంకురార్పణ, ధ్వజారోహణ, అనంతరం రాత్రి 7:30 గంటలకు అమ్మవారి కల్యాణ మహోత్సవాన్ని కనుల వైభవంగా నిర్వహిస్తామని అర్చకులు తెలిపారు.

గ్రామ సమస్యలు పరిష్కరించాలి

ముంచంగిపుట్టు: మండలంలో గల కర్రిముఖిపుట్టు పంచాయితీ గేతలబంధ గ్రామస్తులు ఆదివారం ఆందోళన చేశారు. గ్రామంలో సరైన రహదారి, డ్రైనేజీ వ్యవస్థ లేక ఇబ్బందులు పడుతున్నామని అధికారులు స్పందించాలని కోరారు.

తహసీల్దార్‌ను సన్మానించిన కలెక్టర్



గంగవరం తహసీల్దార్ శ్రీమన్నారాయణను సన్మానిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

గంగవరం: తహసీల్దార్ వచ్చే నెలలో పదవీ విరమణ చేయనున్న విషయాన్ని గమనించిన కలెక్టర్ తన వీడ్కోలు సన్మాన కార్యక్రమంలోనే తహసీల్దార్‌ను సన్మించి గౌరవవించడం పట్ల ఉద్యోగులు ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు. శనివారం రాత్రి పాడేరులో జరిగిన వీడ్కోలు కార్యక్రమంలో కలెక్టర్ సుమిత్‌కుమార్‌ను ఉద్యోగులు, రెవెన్యూ ఉద్యోగులు, సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆయనను అభినందించేందుకు గంగవరం తహసీల్దార్ శ్రీమన్నారాయణ వచ్చారు. అయితే వచ్చే నెలలో శ్రీమన్నారాయణ ఉద్యోగ విరమణ కానున్న విషయాన్ని తెలుసుకున్న కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆయనను దుశ్శాలువాతో సత్కరించి, ఆయన సేవలను కొనియాడారు. కలెక్టర్ ఆత్మీయంగా సత్కరించడంపట్ల రెవెన్యూ ఉద్యోగులు, సిబ్బంది ఎంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

చోడవరం రూరల్: దాదాపు పుష్కరం తర్వాత వారంతా తాము చదువుకున్న కళాశాలలో కలుసుకుని సందడి చేశారు. ఈ ఆత్మీయ కలయికలో వీరంతా తమ పిల్లలతో సహా హాజరు కావడం విశేషం. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 2010-12 విద్యా సంవత్సరాల్లో ఇంటర్మీయట్ సీఈసీ చదివిన విద్యార్థులు ఆదివారం ఈ సమ్మేళనంలో పాల్గొన్నారు. ప్రస్తుతం తాము ఏం చేస్తున్నాం, ఎలా స్థిరపడ్డాం, ఏయే రంగాల్లో ఉన్నాం, పిల్లలు స్థితిగతులను ఒకరినొకరు అడిగి తెలుసుకుని, ఆనాటి తమ కళాశాల అనుభవాలను పంచుకుని టీనేజర్లుగా మారిపోయారు. ఆనాటి విద్యార్థులు తమకు విద్యా బోధన చేసిన ఉపన్యాసకులను గౌరవించి గురుభక్తి చాటుకున్నారు.

శరవేగంగా కల్వర్టు నిర్మాణ పనులు



చిన్నేరుపై కల్వర్టు నిర్మాణ పనులు

రాజవొమ్మంగి: మండలంలోని నెల్లిమెట్ల, లబ్బర్తి గ్రామాల మధ్య చిన్నేరుపై కల్వర్టు నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఈ వాగుపై గల పురాతన కల్వర్టు శిథిలస్థితికి చేరుకోగా ఈ మార్గంలో తరచు వాహన ప్రమాదాలు జరుగుతున్న సంగతి తెలిసిందే. ఈ విషయాన్ని స్థానికులు ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంత ఉదయ భాస్కర్ దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో ఈ కల్వర్టును నిర్మించాలని ఎన్‌హెచ్ 516 సంస్థ ప్రతినిధులను ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు కోరడంతో పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఈ కల్వర్టు నిర్మాణం పూర్తయితే తమ గ్రామాలకు రహదారి రవాణా సదుపాయాలు మెరుగుపడతాయని, ఆర్టీసీ బస్సు సర్వీసులు వస్తాయని సుమారు 15 గ్రామాల ప్రజలు సంతోష పడుతున్నారు.

మలుపు వద్ద నిలిచిపోయిన వ్యాన్



బంగారుమామిడి మలుపు వద్ద రోడ్డుకు అడ్డంగా ఉన్న కర్రల లోడ్ వ్యాన్



బంగారుమామిడి మలుపు వద్ద లోయలోకి దూసుకెళ్లిన ఆటో

- రెండు రోజుల నుంచి రాకపోకలకు అంతరాయం
- ఇదే మలుపు వద్ద లోయలోకి దూసుకెళ్లిన ఆటో

పెదబయలు: మండలంలోని కిముడుపల్లి పంచాయతీ బంగారుమామిడి ఘాట్ మలుపు వద్ద కర్రల లోడ్‌తో వస్తున్న వ్యాన్ రోడ్డుకు అడ్డంగా నిలిచిపోవడంతో రెండు రోజుల నుంచి రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. కిముడుపల్లి పంచాయతీ అరడగూడెం ప్రాంతంలో ఈ నెల 17తేది మధ్యాహ్నం నీలగిరి కర్రల లోడ్‌తో పాడేరు వైపు వెళ్తున్న వ్యాన్ బంగారుమామిటి ఘాట్ మలుపు వద్ద స్టీరింగ్ లాక్ అయ్యి రోడ్డుకు అడ్డంగా నిలిచిపోయింది. దీంతో ద్విచక్ర వాహనాలు మాత్రమే వెళ్లందుకు అవకాశం ఉంది. దీంతో రెండు రోజుల నుంచి లక్ష్మీపేట, గోమంగి, గుల్లేలు, లింగేటి, బొంగరం తదితర పంచాయతీ నుంచి పాడేరు వెళ్లేందు ఈ మార్గంలో ఆటో, జీపు ఇతర పెద్ద వాహనాలు రాకపోకలు నిలిచిపోయాయి. అత్యవరర 108, 104 వాహనాలు, గోమంగి పీహెచ్‌సీ కేసులు ఇదే మార్గం గుండా పాడేరు జిల్లా ఆస్పత్రికి తీసుకుని వస్తారు. దీంతో రెండు రోజుల నుంచి పెదబయలు మీదుగా పాడేరు రావాల్సి వస్తోంది. ఈ పరిస్థితిలో ఇదే మలుపు వద్ద పాడేరు నుంచి గోమంగి వెళ్తున్న ఆటో మలుపు వద్ద ముందుకు వెళ్లలేని పరిస్థితి ఉండడంతో వాహనం తిప్పుకునే క్రమంతో లోయలోకి ఆటో దూసుకెళ్లింది .ఆటోలో డ్రైవర్‌తో పాటుగా మరో వ్యక్తి ఉన్నారు. ఈ ప్రమాదంలో వారు గాయాలు కాకుండా బయటపడ్డారు. అధికారులు స్పందించి మలుపులో నిలిచిపోయిన వ్యాన్‌ను తొలగించి రాకపోకలు పునరుద్ధరించాలని వాహనచోదకులు, స్థానికులు కోరుతున్నారు.

ఆలయ నిర్మాణానికి కమిటీ



మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర

ముంచంగిపుట్టు: మండలంలోని ఏనుగురాయి పంచాయతీ సెల్లుం గ్రామ సమీప కొండ మీద వరహ లక్ష్మీనరసింహస్వామి వారి ఆలయ నిర్మాణానికి కమిటీ ఏర్పాటుచేసినట్టు జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర అన్నారు.మండల కేంద్రంలో ఆదివారం ఆలయ నిర్మాణానికి కమిటీ నియామకం, చేయాల్సిన పనులు, విధివిధానాలపై సమావేశం నిర్వహించారు.అందరి అభిప్రాయాలు సేకరించారు.గ్రామంలో ఆలయ నిర్మాణానికి రూ.60లక్షల నిధుల కేటాయింపులో దేవదాయశాఖ, డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణతో పాటు జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర విశేష కృషి చేశారని పలువురు చెప్పారు. ఈ సందర్భంగా సుభద్రకు గ్రామస్తులు తదితరులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర మాట్లాడుతూ ఆలయ నిర్మాణం కోసం నియమించిన కమిటీకి అందరూ సహాయ సహకారాలు అందించి, పనులు త్వరితగతిన పూర్తయ్యేలా చూడాలని కోరారు. సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, వర్తకులు, పలు పార్టీల నేతలు పాల్గొన్నారు.

సూర్యనారాయణమూర్తికి ప్రత్యేక పూజలు

అనకాపల్లి : జీవీఎంసీ విలీన గ్రామమైన రాజుపాలెం సూర్యనారాయణమూర్తిని ఆదివారం భక్తులు దర్శించుకున్నారు. రథసప్తమి వేడుకల్లో భాగంగా మొదటి ఆదివారం కావడంతో వివిధ ప్రాంతాల నుంచి భక్తుల స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఆలయ చైర్మన్ కొణతాల బాబూరావు ప్రసాద వితరణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆలయ వైస్ చైర్మన్ కర్రి కోటేశ్వరరరావు, కార్యదర్శి గొల్లవిల్లి కోటేశ్వరరావు, కోశాధికారి గొల్లవిల్లి రామకృష్ణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.